
సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

గురువారం | 6 | జులై | 2023



సరస్వతి బ్యారేజీకి నీటి తరలింపు

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీపంపు హౌస్‌లో బుధవారం ఆరు మోటార్లతో నీటిని ఎత్తిపోస్తున్నారు. దీంతో సరస్వతి బ్యారేజీకి జలకళ సంతరించుకుంది.

- 8లో▸



లోతైన అధ్యయనం చేయాలి

లోతైన అధ్యయనంతోనే ఉత్తమ పరిశోధన గ్రంథాలు వెలువడుతాయని తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ భట్టు రమేశ్ అభిప్రాయ పడ్డారు.

- 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $30^0/24^0$

జిల్లాలో ఉదయం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

12, 13 తేదీల్లో స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో 2023–24 సంవత్సరానికి ప్రవేశాలకుగాను ఈనెల 12, 13 తేదీల్లో హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 01, 2013 నుంచి ఆగస్టు 31, 2014 మధ్య జన్మించిన బాల బాలికలకు ఐదోతరగతిలో ప్రవేశాలకు అర్హులుగా పేర్కొన్నారు. జిల్లాలోని బాలబాలికలు ఆయా తేదీల్లో ఉదయం 8 గంటలకు స్టేడియం వద్ద హాజరు కావాలని సూచించారు. కుల, వయస్సు, స్టడీ, జనన ధ్రువీకరణ పత్రాలు, ప్రోగ్రెస్ రిపోర్ట్, 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను వెంట తీసుకుని రావాలని సూచించారు. బాలబాలికలకు బ్యాటరీ పరీక్షలు నిర్వహించి నిబంధనల మేరకు అర్హత గల వారిలో 10 మంది బాలురు, 10 మంది బాలికలను రాష్ట్రస్థాయి ఎంపికకు పంపించనున్నట్లు తెలిపారు. హకీంపేటలో ఈనెల 27వ తేదీన తుది ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. కాగా.. జిల్లా స్థాయిలో ఎంపికైన బాలబాలికలు 26వ తేదీ సాయంత్రం 6గంటల్లోగా హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌నందు హాజరు కావాలని సూచించారు.

ఎంపిక జాబితా వెల్లడి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో 2019 నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఏపీఓ, ఐఈఆర్‌పీల ప్రొవిజనల్ సెలక్షన్ లిస్టును వెల్లడించినట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఓ హనుమకొండ వెబ్‌సైట్‌లో జాబితాను అందుబాటులో ఉంచామని.. అలాగే డీఈఓ కార్యాలయంలో నోటీస్ బోర్డుపై కూడా ఉంచినట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 6న సాయంత్రం ఐదుగంటల్లోపు డీఈఓ కార్యాలయంలో బి6 సెక్షన్‌లో అందజేయాలని డీఈఓ కోరారు.

పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు షురూ



కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. క్యాంపస్‌లోని పలు విభాగాలను ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేశ్‌లాల్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.జ్యోతితో కలిసి విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి పరిశీలించారు. కాగా.. తొలిరోజు 95 శాతం మంది పరీక్షలకు హాజరైనట్లు ఆయన తెలిపారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

కాజీపేట అర్బన్: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ అందిస్తున్న ఫ్యాషన్, ఇంటీరియర్, గ్రాఫిక్, ఫొటోగ్రఫీ డిజైనింగ్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎన్‌ఐఎఫ్‌డీ సంస్థ డైరెక్టర్ రాముని యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఐఎఫ్‌డీ హైదరాబాద్ సంస్థ అందించే కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్ కోసం, మరిన్ని వివరాలకు 90306 10033, 90306 10055 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రిటైర్డ్ ఆచార్యుడికి యూకే ఫెలోషిప్



కేయూ క్యాంపస్: కేయూ విశ్రాంత బయో టెక్నాలజీ ఆచార్యులు, అడ్జంక్ట్ ఆచార్యులు ఎ.సదానందం ప్రతిష్టాత్మక 'రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ (ఎఫ్ఆర్ఎస్‌బీ) యూకే ఫెలో'గా ఎంపికయ్యారు. రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీలో ఫెలోషిప్ అనేది అత్యున్నత స్థాయి సభ్యత్వం. జీవశాస్త్రంలో ఆయన చేసిన విస్తృత పరిశోధనలకు, ప్రతిభకు గుర్తింపుగా రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ (ఎఫ్ఆర్ఎస్‌బీ) ఫెలోగా ఎంపికయ్యారు. అంతేకాకుండా.. సదానందం డాడ్ ఫెలో మరియు రీసెర్చ్ ఫెలోగా ఇదివరకే నాలుగుసార్లు జర్మనీని సందర్శించారు. ఆస్ట్రేలియా, హంగరీ, నెదర్లాండ్స్‌తో సహా ఇతర దేశాలను సందర్శించారు. ఆచార్య సదానందంను వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసరావు, విశ్రాంత ఆచార్యులు, పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆయనను అభినందించారు.

చుట్టపు చూపుగా వైద్యుల రాక!

'సూపర్' ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం

- వేధిస్తున్న ఖాళీలు
- విధుల్లో ఉన్నవాళ్లు ఎప్పుడొస్తారో తెలియదు!
- రోగులకు పూర్తి స్థాయిలో అందని వైద్య సేవలు
- లోపిస్తున్న పాలన.. పరీక్షల కోసం ప్రైవేట్‌కు పరుగులు
- సమాచారం కోసం సూపరింటెండెంట్‌నే సంప్రదించాలి: ఆర్ఎంఓలు



కేఎంసీలో వైద్యం కోసం క్యూలో నిల్చున్న మహిళలు

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఎంజీఎం ఆస్పత్రికి అనుబంధంగా కొనసాగుతున్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పాలన పూర్తి అధ్వానంగా మారింది. ఇక్కడికి వైద్యులు చుట్టపు చూపుగా వచ్చి పోతుండడంతో రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రి నోడల్ అధికారిగా కొనసాగుతున్న డాక్టర్ గోపాల్‌రావుకు జనగామ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆస్పత్రిలో ఎవరికి వారే యమునా తీరే.. అన్నట్లుగా పరిస్థితి మారింది.

అలసత్వం

10 సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో సేవలందించేలా.. 250 పడకలతో ఆస్పత్రిని నెలకొల్పారు. రూ.150 కోట్లు వెచ్చించి నిర్మించినప్పటికీ పరిపాలనాధికారుల అలసత్వంతో పేద రోగులకు మెరుగైన సేవలు అందని ద్రాక్షగానే మారాయి. అన్ని విభాగాల్లో వైద్యుల కొరత, విధుల్లో ఉన్న వైద్యులు చుట్టపు చూపుగా రావడం వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదు.

250 మంది రోగులు.. ముగ్గురే వైద్యులు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో బుధవారం కార్డియాలజీ, అంకాలజీ, గ్యాస్ట్రో, సీటీవీఎస్ వంటి విభాగాల్లో ఔట్‌పేషెంట్ రోగులకు సేవలందిస్తారు. కార్డియాలజీ విభాగంలో సోమ, బుధవారాల్లో మాత్రమే ఓపీ విభాగం ద్వారా సేవలందిస్తారు. మిగతా రోజుల్లో ఓపీ సేవలు లేకపోవడం వల్ల ఈరెండ్రోజుల్లో రోగులు పెద్ద ఎత్తున 'సూపర్' ఆస్పత్రికి వస్తుంటారు. ఈ విభాగాలకు వచ్చే రోగులకు మెరుగైన సేవలందించడంలో పరిపాలనాధికారులు పూర్తిస్థాయిలో విఫలమవుతున్నారు. బుధవారం కార్డియాలజీ ఓపీకి 250 నుంచి 300 మంది రోగులు వైద్య చికిత్సల కోసం రాగా.. ఇద్దరు జూనియర్ డాక్టర్లు, ఒక్క అసిస్టెంట్ ప్రొఫెసర్ మొత్తం ముగ్గురు వైద్యులు సుమారుగా.. 300 మంది రోగులను పరీక్షించారు. ఇందులో అవసరమున్న వారికి ఈసీజీ, టూడీ ఇకో వంటి పరీక్షలను పారామెడికల్ సిబ్బంది, ఇతర వైద్యులు పరీక్షించారు. ఇలా.. 300 మంది హాజరయ్యే ఓపీ విభాగంలో సుమారుగా ఐదు నుంచి 10 మంది వైద్యులను విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని రోగులు, వారి కుటుంబీకులు కోరుతున్నారు. గంటల తరబడి ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా వైద్యం అందించాలని వారు కోరుతున్నారు.

ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలు ప్రైవేట్‌కే..

సూపర్ ఆస్పత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో మెరుగైన చికిత్సల కోసం ఎండోస్కోపీ, కోలనోస్కోపీ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు అవసరం. ఈపరికరాలు మరమ్మతుకు నోచుకోకపోవడంతో రోగులు ప్రైవేట్‌కు వెళ్లి ఈ పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. కాగా.. ఆస్పత్రిలో అందుతున్న సేవలు, వైద్యుల హాజరుపై ఆర్ఎంఓలను (పరిపాలనాధికారులను) వివరణ కోరగా.. ఎలాంటి సమాచారం కావాలన్నా.. తమ వద్ద లేదని.. సూపరింటెండెంట్‌నే అడగాలని పేర్కొనడం గమనార్హం.

'మనఊరు-మనబడి' పనులు పూర్తి చేయాలి

సమీక్షలో కలెక్టర్ ప్రావీణ్య



మన ఊరు మన-బడి పనుల పురోగతి సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మన ఊరు-మన బడి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మన ఊరు-మన బడి, మన బస్తీ-మన బడి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ప్రతీ రెండు రోజులకోసారి మన ఊరు-మన బడి పనులను పరిశీలించాలని సూచించారు. ఎంపీడీఓలు ఎన్ఆర్ఈజీఎస్‌లో చేపట్టిన పనులు పూర్తి చేయించాలన్నారు. బిల్లు నమోదుతోపాటు పెయింటింగ్‌కు సంబంధించి కాంట్రాక్టర్లను పిలిచి పనులు పూర్తయ్యే విధంగా వారికి సంబంధించిన ఎంబీ రికార్డులు పూర్తిచేయాలని పేర్కొన్నారు. ప్రతీ బుధవారం మన ఊరు-మన బడి పనులపై సమీక్ష నిర్వహిస్తామని, పనుల్లో పురోగతి కనిపించాలన్నారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి ఆలస్యం జరగదని.. ఎప్పటికప్పుడు ఎఫ్‌టీఓల్లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓలతో కలెక్టర్ మాట్లాడుతూ చేతి, కులవృత్తుల వారికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం కోసం వచ్చిన దరఖాస్తులను రేపటిలోగా పంపించాలన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డీఈఈలు, ఏఈలు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఎంఎన్ఓలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో లక్ష్మీకాంత్?

వరంగల్: వరంగల్ హనుమాన్ జంక్షన్ సమీపంలో నివాసం ఉంటున్న రియల్టర్ కత్తెరశాల లక్ష్మీకాంత్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. లక్ష్మీకాంత్‌పై హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో భూ క్రయవిక్రయాలపై పలువురు బాధితులు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు అదుపులోకి తీసుకునేందుకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతడి ఇంటికి వెళ్లినట్లు సమాచారం. పోలీసులు ఇంటి ఎదుట ఉండగానే.. రెండు వాహనాలు బయటకు వెళ్లగా.. వాటిని తనిఖీ చేయగా.. అందులో లక్ష్మీకాంత్ లేనట్లుగా తెలిసింది. ఇంట్లోనే లక్ష్మీకాంత్ ఉన్నట్లు నిర్ధారించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించి చివరకు సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా, దీనిపై లక్ష్మీకాంత్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన కాపు సంఘం సమావేశంలో తూర్పులో కొండా దంపతులు విజయం సాధిస్తారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని మాట్లాడడంతో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు తన మిత్రులతోనే తనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయించారని తెలిపారు.

తక్కువ ధరకు ప్లాట్ అమ్ముతానని మోసం..

ఓపెన్‌ప్లాట్‌ను తక్కువ ధరకు అమ్ముతానని చిన్ననాడి మిత్రుడిని మోసం చేసిన రియల్టర్ కత్తెరశాల లక్ష్మీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.కరుణాకర్ తెలిపారు. వేల్పుల ధర్మరాజు, కత్తెరశాల లక్ష్మీకాంత్‌లు చిన్ననాటి స్నేహితులు. స్థానిక కేఎస్ఆర్ గార్డెన్ సమీపంలో ఓపెన్ ప్లాట్లు చేస్తున్నానని, మిత్రుడివి కాబట్టి తక్కువ ధరలో ఇస్తానని సర్వేనంబర్ 625లో 400 గజాల ప్లాట్ చూపించి రూ.12లక్షలు తీసుకున్నాడు. పదేళ్లు దాటినా రేపు మాపు అంటూ రిజిస్ట్రేషన్ చేయలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన ధర్మరాజు ఇదేమి మోసం అని కత్తెరశాల లక్ష్మీకాంత్‌ను అడగగా 'నేను రిజిస్ట్రేషన్ చేయను ఏమి చేసుకుంటావో చేసుకో.. నువ్వు నన్ను ఏమి చేయలేవు. నీ సంగతి చూస్తా' అని భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు లక్ష్మీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు.



జంక్షన్ జలమయం

నిత్యం సుమారు 90 రైళ్లు.. దాదాపు 20 వేల మంది ప్రయాణికుల రాకపోకలు. రూ.9 లక్షల ఆదాయం. ఎంతో ఘన చరిత్ర కలిగిన కాజీపేట రైల్వే జంక్షన్ చిన్నపాటి వర్షానికే జలమయమవుతోంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి స్టేషన్ ఆవరణ, ప్లాట్‌ఫామ్, ఎదురుగా ఉన్న స్థలం నీటితో నిండిపోయింది. నిలిచిన నీటిలో నుంచే ప్రయాణికులు రాకపోకలు సాగించారు. కాగా.. వర్షపు నీటిని బయటికి పంపేందుకు అర్ధరాత్రి వరకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

- కాజీపేట రూరల్

ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

సీఎస్ శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఉన్నతాధికారులు

హన్మకొండ అర్బన్: ఈనెల 8న వరంగల్ నగరంలో ప్రధాని మోదీ పర్యటనను అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎ.శాంతికుమారి.. అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్, ఉన్నతాధికారులతో ఆమె హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. 8వ తేదీన అన్ని శాఖల అధికారులు కచ్చితంగా విధులకు హాజరుకావాలని సూచించారు. ఉదయం 9.35 గంటలకు జిల్లాకు చేరుకోనున్న ప్రధాని మోదీ అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. తిరిగి మధ్యాహ్నం 12.15 గంటలకు హనుమకొండ నుంచి బయల్దేరుతారని తెలిపారు. పోలీస్‌శాఖ తరఫున శాంతి భద్రతలు, ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అగ్నిమాపక వాహనాలు, వైద్య సిబ్బంది, అంబులెన్స్, ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. వేదికల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఎన్‌హెచ్ఏఐ కృష్ణ ప్రదీప్, డీఆర్‌ఓ వాసుచంద్ర, పరకాల ఆర్డీఓ రాము, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సభ ఏర్పాట్లపై పీఎంఓ ఆరా..

హన్మకొండ: వరంగల్ సభ ఏర్పాట్లపై ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి అధికారులు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. అదేవిధంగా ఆమె ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగే బహిరంగ సభ ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు.

పాలిథిన్ నియంత్రణలో నిర్లక్ష్యం ఎందుకు?

- డ్రెయినేజీల్లో గ్రిల్స్ ఏర్పాటు చేయండి
- మేయర్ గుండు సుధారాణి
- క్షేత్రస్థాయిలో తనిఖీలు



వరంగల్‌లో డ్రెయినేజీలను తనిఖీ చేస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ అర్బన్: 'పాలిథిన్ కవర్లు, గ్లాసుల విక్రయాలు నియంత్రించాలని ఎన్నిసార్లు ఆదేశించినా.. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు' అని మేయర్ గుండు సుధారాణి ప్రజారోగ్య సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. బుధవారం వరంగల్‌లోని 24, 28, 29 డివిజన్లలో మేయర్ క్షేత్ర స్థాయిలో పర్యటించారు. శానిటేషన్, ఇంజనీరింగ్ సంబంధ పనుల్ని పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించేందుకు తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంతంలో నిరంతరం ప్లాస్టిక్ వ్యర్థాలు పెద్ద ఎత్తున బయట పడుతున్నాయని, వ్యర్థాలతో డ్రెయినేజీ నిండిపోయి రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోందన్నారు.

గ్రిల్స్ ఏర్పాటు చేయండి..

24వ డివిజన్ పరిధి అప్నా పాన్‌షాప్, పిన్నవారి వీధి ప్రాంతాల్లో డ్రెయినేజీల్లో గ్రిల్స్‌తో కూడిన జాలీలు ఏర్పాటు చేయాలని మేయర్ ఆదేశించారు. 28వ డివిజన్‌లోని సుశీల్ థియేటర్ ప్రాంతంలో రోడ్డు, డ్రెయినేజీ పనులను ప్రారంభించాలని, అన్నపూర్ణ కిరాణం ప్రాంతంలో చెత్త రాకుండా నిలువరించడానికి జాలీలు ఏర్పాటు చేయాలన్నారు. పాత రామా టాకీస్ నుంచి పోతన రోడ్డు వరకు కొత్త డ్రెయిన్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని, బట్టల బజార్‌లో స్లాబ్ తొలగించి డ్రెయిన్ నిర్మించే పనులు టెండర్ దశలో ఉన్నట్లు ఇంజనీరింగ్ అధికారులు మేయర్‌కు వివరించారు. ఈ తనిఖీల్లో కార్పొరేటర్ రమా తేజస్వి, సీఎంహెచ్‌ఓ రాజేశ్, ఈఈ.శ్రీనివాస్, డీఈలు రవికుమార్, సారంగం, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, ఏఈ సతీశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్‌రాజ్, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆధీనంలోకి సీకేఎం కాలేజీ



వరంగల్: వరంగల్‌లోని చందా కాంతయ్య మెమోరియల్ (సీకేఎం) ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలను రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటూ బుధవారం అధికారిక ఉత్తర్వులు (జీఓ ఎంఎస్ నెం.44)జారీ చేసిందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్ మాట్లాడుతూ.. కాలేజీ యాజమాన్యానికి ఇచ్చిన మాట మేరకు రెండేళ్లుగా పలుమార్లు సీఎం కేసీఆర్‌ను కలిసి ఉత్తర్వులు జారీ చేయించినట్లు తెలిపారు. అనంతరం కళాశాల కమిటీ ప్రతినిధులు.. ఎమ్మెల్యేను క్యాంపు ఆఫీసులో కలుసుకుని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు డాక్టర్ టి.సుధాకర్ రెడ్డి, ఎ.కృష్ణమూర్తి, చందా శ్రీకాంత్, ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ధర్మారెడ్డి, లైబ్రేరియన్ ఎస్.అనిల్‌కుమార్, సూపరింటెండెంట్ గాండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు వ్యాగన్ స్థల పరిశీలనకు రైల్వే జీఎం



రైల్వే వ్యాగన్ పరిశ్రమలు నిర్మించే స్థలం ఇదే..

కాజీపేట రూరల్: ఈనెల 8న ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా రైల్వే వ్యాగన్ స్థలాన్ని పరిశీలించేందుకు గురువారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ రానున్నట్లు బుధవారం ద.మ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సీహెచ్.రాకేశ్ తెలిపారు. రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్, వ్యాగన్ తయారీ పరిశ్రమ భూమి పూజ, ఫౌండేషన్ స్టోన్ వేయడానికి పీఎం మోదీ వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భద్రత దృష్ట్యా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, జీఆర్పీ అధికారుల బందోబస్తు, కావాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించనున్నారు. అనంతరం వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్, వ్యాగన్ల తయారీ పరిశ్రమల వివరాలు రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ విలేకరుల సమావేశంలో వెల్లడించనున్నట్లు రాకేశ్ తెలిపారు. రైల్వే జీఎంతో పాటు సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ ఏకే.గుప్తా, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ మున్నకుమార్ రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'నమో' రాక కోసం భారీగా ఏర్పాట్లు

- డీఐజీ నవనీత్ నేతృత్వంలో మూడు ఎస్పీజీ బృందాలు
- రెండు రోజుల నుంచి బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన
- నేడు వరంగల్‌కు కేంద్రమంత్రి, బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి
- 8న మోదీ సభ ముగిసే వరకు ఇక్కడే మకాం
- రేపు సాయంత్రం నుంచే ట్రాఫిక్ ఆంక్షలు



సభాస్థలి వద్ద తనిఖీ చేస్తున్న డాగ్, బాంబ్ స్క్వాడ్‌లు



ప్రధాని మోదీ బహిరంగ సభకు ఆర్ట్స్ కాలేజీలో సిద్ధమవుతున్న వేదిక

సాక్షిప్రతినిధి, వరంగల్ : భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన కోసం ఓరుగల్లు ముస్తాబవుతోంది. మొదటిసారిగా దేశ ప్రధాని వరంగల్‌కు వస్తున్న సందర్భంగా భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజుల కిందట నగరంలో పర్యటించిన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, అప్పటి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తదితరుల నాయకులు, కార్యకర్తలతో హనుమకొండలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి పర్యటన పక్కా కావడంతో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూపు (ఎస్పీజీ) డీఐజీ నవనీత్ కుమార్ మెహతా ఆధ్వర్యంలో మూడు బృందాలు ఢిల్లీ నుంచి హనుమకొండకు చేరుకున్నాయి. వారి ఆధ్వర్యంలోనే ప్రధాని మోదీ పర్యటించే ప్రాంతాలను మంగళ, బుధవారాలు (రెండు రోజులు) హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, పోలీసు కమిషనర్ ఏవీ.రంగనాథ్, బీజేపీ సీనియర్లతో కలిసి పరిశీలించారు.

ఆర్ట్స్ కళాశాల మైదానంలోనే సభ..

హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానంలో మోదీ బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. మొదట కాజీపేట అయోధ్యనగర్‌లో రైల్వే వ్యాగన్ల తయారీ కేంద్రం శంకుస్థాపన చేసిన తర్వాత అదే ప్రాంతంలో సభ నిర్వహించాలనుకున్నారు. భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా ఆర్ట్స్ కాలేజీ మైదానాన్ని ఫైనల్ చేశారు. అక్కడే వర్చువల్ ద్వారా సుమారు రూ.6,110 కోట్ల విలువ చేసే వివిధ అభివృద్ధి పథకాలకు ప్రధాని శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. 176 కి.మీ పొడవైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో 108 కి.మీ పొడవున్న మంచిర్యాల-వరంగల్ సెక్షన్‌లు ఈ ప్రాజెక్టులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా మంచిర్యాల, వరంగల్ మధ్య దూరాన్ని దాదాపు 34 కి.మీల మేర తగ్గిస్తుంది. తద్వారా ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ఏ-44, ఏ-65లలో ట్రాఫిక్‌ను తగ్గిస్తుంది. ఏ-563 లోని 68 కిలోమీటర్ల పొడవైన కరీంనగర్-వరంగల్ సెక్షన్‌ను ఇప్పటికే ఉన్న రెండు లేన్‌ల నుంచి నాలుగు లేన్‌ల రోడ్డుగా అప్‌గ్రేడ్ చేయడానికి కూడా ఆయన శంకుస్థాపన చేస్తారు. హైదరాబాద్-వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, వరంగల్‌లోని సెజ్‌లకు కనెక్టివిటీని మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుంది.

నేడు వరంగల్‌కు కిషన్‌రెడ్డి..

భారతీయ జనతా పార్టీలో జరిగిన పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రధానమంత్రి పర్యటనను సక్సెస్ చేసేందుకు గురువారం వరంగల్‌కు రానున్నారు. 8వ తేదీ ప్రధాని సభ ముగిసే వరకు ఇక్కడే మకాం వేయనున్నారు. అందుబాటులో ఉన్న పార్టీ పదాధికారులు.. అధికార ప్రజాప్రతినిధులు, జాతీయ కార్యవర్గ సభ్యులు ముఖ్య నేతలతో కలిసి వ్యూహరచన చేయనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో 7వ తేదీ సాయంత్రం నుంచే వరంగల్ నగరంలో ట్రాఫిక్ ఆంక్షలను అమల్లోకి తెచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నారు.

వ్యాగన్ పరిశ్రమల శంకుస్థాపనకు 500మంది రైల్వే కార్మికులు

- వివరాలు 8లో▸

వృద్ధురాలిని మోసగించిన మహిళ..

- బంగారం, వెండితో ఉడాయింపు


బాధితురాలు ఐలమ్మ

ములుగు రూరల్ : ఓ గుర్తు తెలియని మహిళ.. బ్యాంకు లోన్ ఇప్పిస్తానని వృద్ధురాలికి మాయమాటలు చెప్పి బంగారం, వెండి దోచుకొని ఉడాయించింది. ఈ ఘటన బుధవారం మండలంలోని మల్లంపల్లిలో జరిగింది. బాధితురాలు సావూరి ఐలమ్మ కథనం ప్రకారం ఆత్మకూర్ మండలం కటాక్షాపూర్ శివాజీ విగ్రహం వద్ద కూర్చున్న తన దగ్గరకు గుర్తు తెలియని మహిళ వచ్చి మాట్లాడింది. తాను బ్యాంకు లోన్ ఇప్పిస్తానని చెప్పి బస్సులో మల్లంపల్లికి తీసుకువచ్చింది. అనంతరం వృద్ధురాలిని బ్యాంకు ఎదుట ఉంచి లోపలికి వెళ్లినట్లు నటించి బ్యాంకు వాళ్లు శరీరంపై బంగారం ఉంటే లోన్ ఇవ్వనంటున్నారని చెప్పింది. దీంతో ఆ మాటలు నమ్మిన వృద్ధురాలు.. తన శరీరంపై ఉన్న కమ్మలు, మాటీలు, వెండి, కడియాలు తీసి మహిళకు ఇచ్చింది. నగలు తీసుకున్న మహిళ.. వృద్ధురాలి కళ్లుకప్పి ఉడాయించింది. బ్యాంకులోపలి నుంచి ఎంతకు బయటకురాకపోవడంతో మహిళ మోసగించిందని గుర్తించిన ఐలమ్మ రోదించడంతో స్థానికులు ప్రశ్నించగా జరిగిన విషయం వెల్లడించింది. ఈ విషయమై పోలీసులను సమాచారం కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ఫలించిన 18 ఏళ్ల పోరాటం

షెడ్యూల్డ్ ఏరియాలోకి మంగపేటలోని 23 రెవెన్యూ గ్రామాలు

- హైకోర్టు సంచలన తీర్పుతో గిరిజనుల హర్షాతిరేకాలు
- గిరిజనులు, గిరిజనేతరుల పంచాయితీతో 2011నుంచి నిలిచిన ఎన్నికలు..
- అప్పటినుంచి ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు
- ఎవరూ పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరం
- తాజాగా కోర్టు తీర్పుతో ఎన్నికల తోపాటు పలు అంశాల్లో గిరిజనులకే సర్వహక్కులు


మంగపేటలో టపాసులు కాలుస్తూ సంబురం జరుపుకుంటున్న గిరిజనులు

మంగపేట: గిరిజనుల కల సాకారమైంది. 18ఏళ్లగా పోరాడుతున్న శ్రమకు ఫలితం దక్కింది. మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలోని 23 రెవెన్యూ గ్రామాలు ఐదో షెడ్యూల్డ్ ఏరియా పరిధిలోకి వస్తాయని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ బుధవారం తీర్పు ఇచ్చారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తమ స్వప్నం సాకారమైందని విజయోత్సవాలు జరుపుకున్నారు. మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల సర్పంచ్ ఎన్నికలు 2005 వరకు జనరల్ రొటేషన్ (జనాభా)దామాషా పద్ధతిన జరిగాయి. 2006లో మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఎస్టీలకు 100 శాతం రిజర్వేషన్ ప్రకటిస్తూ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది. ఎస్టీలకు 100శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ఎనిమిది మంది గిరిజనేతరులు హైకోర్టును ఆశ్రయించారు. అప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో 2006లో 18 గ్రామ పంచాయతీల ఎన్నికలు ఎస్టీ రిజర్వేషన్ పద్ధతిన జరిగాయి. 2011లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే సమయంలో రెండోసారి గిరిజనులు మంగపేట మండలం షెడ్యూల్డ్ ఏరియా కాదని, ఎస్టీలకు కల్పించిన రిజర్వేషన్ చెల్లదని 1973, 74లో అప్పటి హైకోర్టు గిరిజనేతరులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని పలు అంశాలతో కూడిన నివేదికతో హైకోర్టును ఆశ్రయించారు. గిరిజనేతరుల ఫిర్యాదు స్వీకరించిన హైకోర్టు ఎన్నికలను నిలుపుదల చేస్తూ స్టే ఇచ్చింది. అప్పటి నుంచి మంగపేట మండలం షెడ్యూల్డ్ ఏరియా అని గిరిజనులు.. కాదని గిరిజనేతరుల హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 2013లో జరగాల్సిన పంచాయతీ ఎన్నికలు సైతం నిలిచిపోయాయి.

హైకోర్టు తీర్పు ఇలా..

'భారత రాజ్యాంగంలో పొందుపరిచిన 1/70, 1959 ఎల్టీఆర్(భూ బదలాయింపు), అటవీ హక్కుల చట్టం, కో ఆపరేటివ్ సహకార సంఘం ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వహక్కులు గిరిజనులకు వర్తిస్తాయి'

ఎంపీటీసీగా గెలిచినా ఫలితం లేకుండా పోయింది

మంగపేట మండలం షెడ్యూల్డ్, నాన్ షెడ్యూల్డ్ సమస్య కోర్టులో పెండింగ్‌లో ఉండగా 2014లో ఎంపీటీసీ స్థానాలకు జనరల్ రొటేషన్ పద్ధతిన ఎన్నికలు జరిగాయి. ఎన్నికల లెక్కింపు నిర్వహించి 14 మంది ఎంపీటీసీ సభ్యులుగా గెలుపొందినట్లుగా ఎన్నికల అధికారులు పత్రాలు అందజేశారు. ఎంపీపీ ఎన్నిక జరిగే సమయంలో గిరిజనులు ఏజెన్సీ ప్రాంతంపై కోర్టును ఆశ్రయించడంతో ఎన్నిక నిలిచింది. దీంతో ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీటీసీ సభ్యులు ఎలాంటి ఫలితాన్ని పొందలేకపోయారు.

స్వరాష్ట్రంలో తొలిసారి ఎన్నికలకు బ్రేక్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం తొలిసారి జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలకు సైతం బ్రేక్ పడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పాత 18 గ్రామ పంచాయతీలతో పాటు నూతనంగా ఏర్పడిన 7 గ్రామ పంచాయతీలకు మొదటిసారిగా 2019 జనవరిలో 25 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్టీలకు 100 శాతం రిజర్వేషన్ కల్పించి నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో గిరిజనేతరులు మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. అయినప్పటికీ 25 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌గా పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన అభ్యర్థులు ప్రచారం సైతం నిర్వహించారు. జనవరి 30న పోలింగ్ జరగాల్సి ఉండగా 28వ తేదీన ఎన్నికలను నిలుపుదల చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం జరగాల్సిన జెడ్పీటీసీ ఎన్నిక సైతం నిలిచిపోయింది.

2014 తీర్పును సవాల్ చేస్తూ..

ఈ క్రమంలో 2014 ఏప్రిల్‌లో మండల పరిధిలోని 23 రెవెన్యూ గ్రామాలు షెడ్యూల్డ్ ప్రాంత పరిధిలోకి వస్తాయని హైకోర్టు జడ్జి రమేష్ రంగనాథన్ తీర్పు నిచ్చారు. కోర్టు తీర్పును సవాల్ చేస్తూ గిరిజనేతరులు డివిజన్ బెంచ్‌లో రిట్ పిటిషన్ వేశారు. అప్పటి నుంచి ఇంటీరియమ్ డైరెక్షన్ డివిజన్ బెంచ్ పిటిషన్‌పై గిరిజనులు, సంఘాలు సవాల్ చేస్తూ పిటిషన్ వేయగా కేసు పూర్వపరాలను పూర్తిస్థాయిలో పరిశీలించిన తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మంగపేట మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలు షెడ్యూల్డ్ ఏరియా పరిధిలోకి వస్తాయని బుధవారం తుది తీర్పు నిచ్చారు. హైకోర్టు తీర్పుతో మంగపేట మండలం షెడ్యూల్డ్ ఏరియా, నాన్ షెడ్యూల్డ్ ఏరియా అనే సందిగ్ధానికి తెరపడింది.

23 రెవెన్యూ గ్రామాలివే..

1) పాదుమూరు 2) తొండ్యాల లక్ష్మీపురం, 3) బోరు నర్సాపురం, 4) కోమటిపల్లి, 5, చెరుపల్లి, 6) తిమ్మంపేట, 7) మల్లూరు, 8) చుంచుపల్లి, 9) రమణక్కపేట, 10) వాడగూడెం, 11) నర్సింహసాగర్, 12) రాజుపేట, 13) కత్తిగూడెం, 14) బ్రాహ్మణపల్లి, 15) రామచంద్రునిపేట, 16) పూరేడుపల్లి, 17) దోమెడ, 18) బండారుగూడెం, 19) అకినేపల్లిమల్లారం, 20) కమలాపురం, 21) గొళ్లగూడెం, 22) బర్లగూడెం, 23) లొడుగుగూడెం

వ్యాగన్ పరిశ్రమల శంకుస్థాపనకు

రైల్వే కార్మికుల తరలింపు

కాజీపేట రూరల్ : ప్రధాని మోదీ ఈ నెల 8వ తేదీన కాజీపేట రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ (పీఓహెచ్), రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమలకు భూమి పూజ చేయనున్న నేపథ్యంలో కాజీపేట జంక్షన్ నుంచి 500 మంది రైల్వే కార్మికులను తరలించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారని రైల్వే వర్గాలు తెలిపాయి. ఎలక్ట్రిక్, డీజిల్ లోకోషెడ్లతో పాటు వివిధ రైల్వే విభాగాల నుంచి రైల్వే కార్మికులను వ్యాగన్ స్థలం వద్దకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి కార్మికులను ఎంపిక చేసి వారికి పాస్‌లు జారీ చేసే పనిలో అధికారులు నిమగ్నమైనట్లు తెలిసింది. గతంలో కూడా సికింద్రాబాద్–తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించేందుకు ప్రధాని మోదీ వచ్చిన సమయంలో కూడా కాజీపేట జంక్షన్ నుంచి సుమారు 100 మంది రైల్వే కార్మికులను సికింద్రాబాద్‌కు తరలించినట్లు రైల్వే నాయకులు తెలిపారు.కాగా, కార్మికులను వేరే కార్యక్రమాలకు ఉపయోగించడం వల్ల రైల్వేకు నష్టం జరుగుతుందని పలువురు సీనియర్ నాయకులు పేర్కొంటున్నారు.

20 కిలోల గంజాయి పట్టివేత

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్‌లో బుధవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఓ వ్యక్తినుంచి 20 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి కథనం ప్రకారం.. నరేష్‌కుమార్ దోరయి (34) అనే వ్యక్తి పూరి నుంచి 20 కిలోల గంజాయితో రైలులో ప్రయాణిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్, ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు దాడి చేసి నరేశ్ కుమార్‌ను పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.4లక్షల ఉంటుందని, నిందితుడినుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో అప్రమత్తంగా వ్యవహరించిన సీఐలు అల్లం రాంబాబు, కె.శ్రీనివాస్‌రావుతో పాటు సిబ్బందిని సీపీ ఏవీ రంగనాథ్ అభినందించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

శాయంపేట : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం శాయంపేట మండంలోని పెద్ద కోడెపాకలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మంద సమ్మయ్య (65) పని నిమిత్తం బైక్‌పై పరకాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో లలిత కన్వెన్షన్ హాల్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్యాంకర్ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హన్మకొండ చౌరస్తా: విశ్వబ్రాహ్మణ విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్ల విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(వోపా) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరామోజు నాగరాజారావు తెలిపారు. హనుమకొండ రెడ్డికాలనీలోని వోపా కార్యాలయంలో బుధవారం కమిటీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజారావు మాట్లాడుతూ 2023 విద్యా సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. అర్హత గల వారు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుకు మెమో, కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జత చేయాలని, గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులను స్వీకరించమన్నారు. పురస్కారాలు అందజేసే తేదీ, వేదికను త్వరలో ప్రకటిస్తామని, వివరాలకు 94403 13745, 95501 51292, 93464 79945 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాల కన్వీనర్ డాక్టర్ పాడిచెట్టి విష్ణువర్ధన్, వోపా జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరం భిక్షపతి, కోశాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లోతైన అధ్యయనం చేయాలి

- తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ భట్టు రమేశ్


మాట్లాడుతున్న తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ రమేశ్

విద్యారణ్యపురి: లోతైన అధ్యయనంతోనే ఉత్తమ పరిశోధన గ్రంథాలు వెలువడుతాయని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భట్టు రమేశ్ అభిప్రాయపడ్డారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠం సెమినార్ హాల్లో డాక్టర్ నోముల రాజు రాసిన 'జాంబ పురాణం.. వివిధ కథకుల కథలు – తులనాత్మక అధ్యయనం పుస్తకం'ను ఆవిష్కరించి ఆ పుస్తక సమీక్ష నిర్వహించారు. జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ భట్టు రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాంబపురాణం సిద్ధాంత గ్రంథం తన పర్యవేక్షణలో వచ్చిందని, పరిశోధకుడు రాజు సమాజానికి విలువైన సమాచారం అందించడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథి కేయూ చరిత్ర విభాగం ప్రొఫెసర్ ఎన్. కనకరత్నం మాట్లాడుతూ జాంబ పురాణం పుస్తకంలో మాదిగ ఆశ్రిత కులాల కథకులు చెప్పే కథనాల ఆధారంగా రూపొందించారన్నారు. ఇంకా దీనిపై పరిశోధన జరగాలన్నారు. సభాధ్యక్షుడు వెంకన్న మాట్లాడుతూ నాలుగు ఆశ్రిత కులాలకు చెందిన కథకులు వివరించిన పురాణాలు, ఇతిహాసాల రూపమే జాంబ పురాణమన్నారు. కాగా, పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీమంతుల దామోదర్, బాసని సురేశ్.. పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర నాయకుడు జీవీఎస్ శ్రీనివాసచారి, పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్ చూరపల్లి రవి కుమార్, గంపా సతీశ్, విజయలక్ష్మి, సునంద, ఆంజనేయులు, అశోక్, సులోచన తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి బ్యారేజీకి నీటి తరలింపు..

- లక్ష్మీపంపుహౌస్‌లో ఆరు మోటార్లు రన్
- మూడో రోజు కొనసాగిన ఎత్తిపోతలు


లక్ష్మీపంపుహౌస్‌లో ఎత్తిపోస్తున్న నీరు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీపంపుహౌస్‌లో ఆరు మోటార్లతో మూడోరోజు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. బుధవారం లక్ష్మీపంపుహౌస్‌లోని పదకొండు మోటార్లలో ఆరు మోటార్ల ద్వారా నీటిని డెలివరీ సిస్టర్న్‌లో ఎత్తిపోస్తున్నారు. దీంతో గ్రావిటీకాల్వకు రెండు టీఎంసీల నీరు తరలినట్లు ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

లక్ష్మి, సరస్వతి బ్యారేజీలకు జలకళ

తెలంగాణలో వర్షాలు పడకపోయినా మహారాష్ట్రలో కురిసిన వర్షాలతో ప్రాణహిత నది వరదతో అన్నారం(సరస్వతి), మేడిగడ్డ(లక్ష్మి) బ్యారేజీల్లో జలకళ సంతరించుకుంది. ప్రాణహిత నది ద్వారా ఇన్‌ఫ్లో 23,200ల క్యూసెక్కుల వరద తరలి మేడిగడ్డ(లక్ష్మి)బ్యారేజీకి చేరుతుంది. బ్యారేజీలోని మొత్తం 85 గేట్లన్నీ మూసిఉండగా, బ్యారేజీలో 16.17 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి ప్రస్తుతం 7.860 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అటు అన్నారం(సరస్వతి)బ్యారేజీలో గోదావరి, మానేరు నదుల నుంచి ఇన్‌ఫ్లో 1,500ల క్యూసెక్కులు తరలి వస్తుంది. బ్యారేజీలో మొత్తం 66గేట్లు మూసి ఉండగా, బ్యారేజీ పూర్తి సామర్థ్యం 10.87 టీఎంసీలకు గాను ప్రస్తుతం 7.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శిల్పకళా సంపద అద్భుతం..

- అమెరికా దేశస్తుల కితాబు


శిల్ప కళా సంపదను తిలకిస్తున్న అమెరికా దేశస్తులు

ఖిలా వరంగల్: కాకతీయుల నిర్మాణ శైలి, శిల్ప కళా సంపద అద్భుతమని అమెరికా దేశస్తులు కొనియాడారు. బుధవారం ఖిలావరంగల్ కోటను సందర్శించారు. ఈ సందర్భంగా మధ్య కోట శిల్పాల ప్రాంగణంలోని నాలుగు కాకతీయ కీర్తి తోరణాల నడమ ఉన్న శిల్పులు, నల్లరాతిలో చెక్కిన అద్భుత శిల్ప కళా ఖండాలను తిలకించారు. అనంతరం రాతి, మట్టికోట అందాలతోపాటు ఏకశిలా చిల్డ్రన్ పార్కు, ఏకశిల గుట్ట, ఖుషిమహాల్‌ను సందర్శించారు. అంతకు ముందు కాకతీయుల విశిష్టత, చారిత్రక కట్టడాల గురించి గైడ్ రవియాదవ్ వివరించారు. మొబైల్, కెమెరాలతో కాకతీయుల శిల్ప కళ సంపద, చారిత్రక కట్టడాలను ఎదుట ఫొటోలు దిగి ఆనందంగా గడిపారు. వారి వెంట కేంద్ర పురావస్తు శాఖ సిబ్బంది, టీఎస్‌టీడీసీ కోఆర్డినేటర్ గట్టికొప్పుల అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతుల్లో లోపించిన పారదర్శకత

- యూజీసీ నిబంధనలను విరుద్ధంగా అధికారుల చర్యలు
- యూజీసీకి ఫిర్యాదు చేసిన 'అకూట్' జనరల్ సెక్రటరీ ఇస్తారి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో రెండేళ్లుగా పాలన కొనసాగిస్తున్న అధికారులు చేసే తప్పిదాలను ప్రశ్నిస్తున్న వారిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకూట్) జనరల్ సెక్రెటరీ మామిడాల ఇస్తారి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కేయూ అధికారులు.. అధ్యాపకులపై వ్యక్తిగత కక్షలకు పాల్పడుతూ బదిలీలు, షోకాజ్ నోటీసుల పేరిట భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం పదోన్నతుల కోసం దరఖాస్తు చేసుకున్న టీచర్ల దరఖాస్తులను ఆరు నెలల్లోపు స్క్రూట్నీ చేసి ఇంటర్వ్యూ నిర్వహించాలన్నారు. దరఖాస్తు చేసి ఏడాదైనా ఇప్పటి వరకు కొందరు టీచర్ల దరఖాస్తులను స్క్రూట్నీ చేసి ఇంటర్వ్యూ నిర్వహించలేదని, ఇది యూజీసీ నిబంధనలకు విరుద్ధమన్నారు.

పదోన్నతుల ప్రక్రియపై యూజీసీ ఆరా?

యూనివర్సిటీలో అధ్యాపకుల పదోన్నతుల ప్రక్రియలో పారదర్శకత లోపంపై, యూజీసీ నిబంధనల అతిక్రమణలపై యూజీసీకి అకూట్ ఫిర్యాదు చేయగా స్పందించిన యూజీసీ, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యూనివర్సిటీ అధికారులను పదోన్నతుల పూర్తి వివరాలు పంపమని అడిగినట్లు తెలిసిందన్నారు. అయితే అకూట్ ఫిర్యాదును రద్దు చేసుకునేలా అధికారులు పావులు కదుపుతున్నారని ఇస్తారి తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య


భద్రు (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం ఉదయం మహబూబాబాద్ మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో జరిగింది. రూరల్ ఎస్సై రామ్‌చరణ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన గుగులోత్ భద్రు (58)కు రెండు ఎకరాల భూమి ఉంది. అందులో గతేడాది మిర్చి సాగు చేయగా సరైన దిగుబడి రాలేదు. పైగా రూ.2.30 లక్షలు అప్పు అయింది. దీంతో కొంతకాలంగా మనస్తాపానికి గురవుతున్న ఆయన.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయాన్ని చిన్న కోడలు సైదుకు చెప్పాడు. దీంతో స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై కుమారుడు చందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బాలుడిని చిదిమేసిన ట్రాక్టర్..

- వెనక చక్రం కింద పడడంతో మృతి
- శోకసంద్రంలో కుటుంబం
- నారాయణపురంలో ఘటన


హేమంత్ మృతదేహం

కేసముద్రం: అప్పటి వరకు బోసినవ్వులతో ఇంట్లో సందడి చేసిన యేడాదిన్నర బాలుడిని ట్రాక్టర్ చిదిమేసింది. డ్రైవర్ అజాగ్రత్త వల్ల ట్రాక్టర్ వెనక చక్రం కింద పడి చిన్నారి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన బుధవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం నర్సింహులపేట మండలం బంజర గ్రామానికి చెందిన మారుపంగ ఐలయ్య, విజయ దంపతులకు కూతురు సమత, ఇద్దరు కుమారులు రిత్విక్, హేమంత్‌కుమార్(18నెలల వయస్సు) ఉన్నారు. గతేడాది క్రితం విజయ తన పిల్లలతో వచ్చి నారాయణపురం గ్రామంలోని తన తల్లిగారింటి వద్ద ఉంటుంది. ఆమె భర్త ఐలయ్య కూలీ పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈనెల 3న ఐలయ్య అత్తగారింటికి వచ్చాడు. ఈ క్రమంలో ఇంటి ఎదుట ఉన్న గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను తీసుకెళ్లేందుకు డ్రైవర్ పందుల మధుసూదన్ వచ్చాడు. ట్రాక్టర్‌కు సెల్ఫ్‌మోటారు పనిచేయకపోవడంతో ఐలయ్య ముందుకు నెట్టాడు. స్టార్ట్ అయిన ట్రాక్టర్‌ను డ్రైవర్ మధుసూదన్ ముందుకు తీసుకెళ్తున్నాడు. అప్పటికే ఇంటిఎదుట ఆడుకుంటున్న హేమంత్ ట్రాక్టర్ కిందకు రావడంతో వెనక చక్రం మీదు నుంచి వెళ్లింది. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించగా బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అప్పటి వరకు బోసినవ్వులతో ఇంట్లో ఆటలాడిన ఆ బాలుడు కళ్ల ముందే కానరానిలోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అజాగ్రత్తతో ట్రాక్టర్‌ను నడిపిన మధుసూదన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, బాలుడి మృతదేహాన్ని స్వగ్రామం బంజరకు తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా మృతిచెందిన బాలుడి వెంట జిల్లా ఆస్పత్రికి వెళ్లిన డ్రైవర్ మధుసూదన్ భయాందోళనతో, అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతడిని ఆస్పత్రిలో చేర్చారు.

ఒక్కరోజులోనే ఉత్తర్వులు వెనక్కి..

- అంబేద్కర్ స్టడీసెంటర్ డైరెక్టర్‌గా కాంట్రాక్ట్ లెక్చరర్ రాజ్‌కుమార్


రాజ్‌కుమార్‌కు ఉత్తర్వు కాపీని అందజేస్తున్న రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ కాంట్రాక్ట్ అధ్యాపకుడు సీహెచ్ రాజ్‌కుమార్‌ను నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ పోస్టులో మ్యాథమెటిక్స్ విభాగం ప్రొఫెసర్ ఎల్ సీ రాజ్‌కుమార్ ఉండగా ఆయన స్థానంలో తెలుగు విభాగం కాంట్రాక్ట్ లెక్చరర్ కె సదాశివను నియమించారు.అలాగే ఎస్సీ,ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా కూడా సదాశివకు అప్పగించారు. బుధవారం ఆయన బాధ్యతలను కూడా స్వీకరించారు. రెండు పదవులు ఒక్కరికే అప్పగించడంతో యూనివర్సిటీ అధికారుల తీరుపై విమర్శలు వచ్చాయి. దీంతో సదాశివను ఎస్సీ,ఎస్టీ సెల్ డైరెక్టర్‌గానే పరిమితం చేసి అంబేద్కర్‌స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా మరో కాంట్రాక్టు లెక్చరర్ సీహెచ్‌రాజ్‌కుమార్‌ను నియమించారు. అయితే అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్ పదవిని రెగ్యులర్ ప్రొఫెసర్లకు అప్పగించాల్సిండగా కాంట్రాక్ట్ లెక్చరర్‌కు అప్పగించడంపై రెగ్యులర్ ప్రొఫెసర్లు విమర్శిస్తున్నారు.